


ప్రాదేశిక ఎన్నికలపై అనిశ్చితి



- జూలై 4వ తేదీతో ముగియనున్న గడువు
- ఇంకా మొదలుకాని ఎన్నికల కసరత్తు
- ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం
- మండలాల పునర్విభజన, రిజర్వేషన్లపై అస్పష్టత
- గతంలో రెండు నెలలు ముందుగానే ఎన్నికలు
- ఈసారి సకాలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ పోరు జరిగేనా?

హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జడ్పీటీసీలు), మండల పరిషత్తుల ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీలు) ఎన్నికలు గడువులోపు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు మాదిరిగానే జిల్లా, మండల పరిషత్తులకు కూడా ప్రత్యేక పాలనాధికారులను నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రాదేశిక నియోజవర్గాల పాలక వర్గాల గడువు జూలై 4వ తేదీతో ముగియనున్నది. వాస్తవానికి 2019లో అప్పటి పాలకవర్గాల గడువు ఐదేళ్లు ముగియక ముందే.. రెండు నెలల ముందుగానే.. అంటే మే 15న ప్రాదేశిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో అప్పుడు ఎన్నికైన కొత్త పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టడానికి రెండు నెలలు వేచి ఉండాల్సి వచ్చింది. కానీ ఈ సారి గడువు సమీపిస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల సమరంపై కసరత్తు ప్రారంభం కాలేదు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపుతో లోకసభ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఆ తర్వాత వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే దిశగా ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. మూడు విడతలుగా జరిగే ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడానికి కనీసం రెండు నెలలైనా పడుతుంది. అప్పటికీ ప్రాదేశిక పాలకవర్గాల గడువు ముగుస్తుంది. ఆతర్వాతగానీ ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేపట్టే అవకాశాలు లేవు. అయితే పంచాయతీ ఎన్నికల కన్నా ప్రాదేశిక ఎన్నికల విషయంలో కొంత అనిశ్చితి నెలకొని ఉన్నది. స్పష్టత రావడానికి రాష్ట్ర ప్రభుత్వం కొంత ముందస్తు కసరత్తు చేయాల్సి ఉన్నది.

పునర్విభజనతో..

2019లో ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగి జడ్పీలు కొలువు దీరిన తర్వాత తదనంతర కాలంలో కొన్ని జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగింది. దీనితో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మార్పు జరిగింది. ఒక జిల్లాలో ఉన్న ప్రాదేశిక నియోజకవర్గాలు మరో జిల్లా పరిధిలోకి వెళ్లాయి. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలు హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా మారడం ఇందుకు ఉదాహరణ. అయితే అప్పటికే జిల్లా ప్రజాపరిషత్తు, మండల ప్రజాపరిషత్తులు కొలువు తీరడం వల్ల అవి ఇప్పటి వరకు పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతూ వస్తున్నాయి. ఇప్పుడు ప్రాదేశిక ఎన్నికలు కొత్తగా చేరిన జడ్పీటీసీలు, ఎంపీటీలను కలుపుకొని ఎన్నికలు నిర్వహిస్తారు.

మొదలుకాని కసరత్తు

జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించాలంటే రిజర్వేషన్లు, ఓటర్ల ముసాయిదా జాబితా, పోలింగ్ బూత్‌ల ఎంపిక, అధికారులకు శిక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటి వరకు ఈ ప్రక్రియలేవి ప్రారంభం కాలేదు. ఒక వేళ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా పనులన్నీ చక్కబెట్టాలంటే కనీసం మూడు నెలలైనా పట్టే అవకాశం ఉన్నట్టు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అంటే గడువులోపు ఎన్నికలు జరగడం అసాధ్యంగా కనిపిస్తోంది.

ఇప్పటికిప్పుడు అసాధ్యం

ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినా క్షేత్ర స్థాయిలో వీలు పడకపోవచ్చు. 2019లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 71 జడ్పీటీసీలు, 1,030 మండల ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ) ఉన్నాయి. వాటికి ఎన్నికలు నిర్వహించిన సమయంలో కొత్తగా అమల్లోకి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ చట్టం ప్రకారం అప్పటి రిజర్వేషన్లు రెండు పర్యాయాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దృష్ట్యా ఈసారి కూడా అవే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. కానీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. గత ప్రభుత్వం హయాంలో రాజకీయ ప్రాబల్యాలను దృష్టిలో పెట్టుకొని కొత్త మండలాల ఏర్పాటు జరిగింది. ఎన్నికల అనంతర కాలంలో కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని కొత్త మండలాలు కూడా ఏర్పడ్డాయి. జిల్లాల పునర్విభజన జరిగింది. ఈ క్రమంలో ములుగు జిల్లా కొత్తగా ఏర్పాటైంది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా స్థానే హనుమకొండ, వరంగల్ జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మండలాల బదిలీ జరిగింది. ఇలా జరిగినా.. ఈ మండలాలు పాత జడ్పీ పాలక వర్గ పరిధిలోనే ఇప్పటి వరకు కొనసాగుతూ వచ్చాయి. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే కొత్త ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల వివరాలను అడగడంతో వివరాలను పంపించారు. జులై 5తో జిల్లా పరిషత్తు, మండల పరిషత్తుల పాలకవర్గాల గడువు ముగియనుండడంతో తదుపరి ప్రభుత్వ ఆదేశాల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. ఆ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 71 జడ్పీటీసీ, 1030 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 7 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అవి హసన్‌పర్తి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు. జిల్లాల పునర్విభజన ఫలితంగా ఐదు మండలాలు ఆత్మకూరు, శాయంపేట, దామెర, పరకాల, నడికూడ హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చాయి. దీనితో హనుమకొండ జిల్లాలో జడ్పీటీసీ స్థానాల సంఖ్య 12కు పెరగనున్నది. జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 86 ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుతం 16 జడ్పీటీసీలు ఉన్నాయి. ఏడాది కిందట మండలాల పునర్విభజనతో రెండు మండలాలు సీరోలు, ఇనుగుర్తి వచ్చి చేరాయి. దీంతో ఈ జిల్లాలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 18కి చేరనున్నది. ఎంపీసీ స్థానాలు 198 ఉన్నాయి. జనగామ జిల్లాలో 12 జడ్పీటీసీలు, 141 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 11 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. కొంత కాలం కిందట పునర్విభజనతో గోరికొత్తపల్లి వచ్చి చేరింది. దీంతో ఈ జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య 12కు చేరనున్నది. ఎంపీటీసీ స్థానాలు 106 ఉన్నాయి. ములుగు జిల్లాలో 9 జడ్పీటీసీలు ఉన్నాయి. ఎంపీటీసీలు 87. వరంగల్ జిల్లాలో 16 జడ్పీటీసీలు, 412 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్
- అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంపీడీవోలు, డీఈలు, ఏఈలు ఓనర్‌షిప్‌గా పనులు పూర్తి చేయాలన్నారు. గూగుల్ స్ప్రెడ్ షీట్ తయారుచేసి రోజువారీ పనుల పనితీరును పరిశీలించాలని చెప్పారు. జిల్లాలో ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలలు 438కి గాను 432 గ్రౌండింగ్ అయ్యాయని, మిగతావి రెండు రోజుల్లో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన పాఠశాలల రూపురేఖలు మార్చే విధంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జడ్పీ సీఈవో నర్మద, డీఈవో రామారావు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్న పదవ తరగతి అడ్వాన్డ్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పదవ తరగతి సప్లిమెంటరీ, ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 3 నుంచి 13 వరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే పదవ తరగతి అడ్వాన్డ్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 591 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. పదవ తరగతి ప్రధాన పరీక్షల మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జిల్లా అధికారులు రామారావు, నరేష్, కళావతిబాయి, మునిసిపల్ కమిషనర్లు నోముల రవీందర్, నరేష్, ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్, పరీక్షల విభాగం పర్యవేక్షకులు భద్రకాళి పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లాలో 16 కేంద్రాలు.. హాజరు కానున్న 4,679 మంది

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 23 : మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమై జూన్ 3వ తేదీ వరకు కొనసాగనున్నాయని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి సమ్మెట సత్యనారాయణ గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, వొకేషనల్ కోర్సుల నుంచి 4,679 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా 16 సెంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షకు విద్యార్థులు నిర్ణీత సమయానికంటే అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబడదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈవో సత్యనారాయణ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నేత రాజవర్ధన్‌రెడ్డి

దేశ రక్షణ, సమగ్రతకు బీజేపీని గెలిపించాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజవర్ధన్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, మే 23 : దేశ రక్షణ, సమగ్రత కోసం బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెడవెల్లి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని, నేటికి ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పలేని స్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. ప్రధాని మోదీ వరంగల్‌కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేసి దాని నిర్మాణం కోసం రూ.800 కేటాయించారని చెప్పారు. గిరిజన యూనివర్శిటీతో పాటు రామగుండంలో ఎరువుల కార్మాగారాన్ని పునఃప్రారంభించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. నిరుద్యోగులు ఇప్పటికైనా ఆలోచించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, యాప సీతయ్య, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, మొసంగి మురళి, ఆకుల శ్రీనివాస్, ధర్మారపు వెంకన్న, పైండ్ల శ్రీనివాస్, రామడుగు వెంకటాచారి, మారగాని రాజుగౌడ్, కృష్ణ, చుక్కల నరేష్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అటకెక్కాయి

మరిపెడ : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.రాజవర్ధన్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన మరిపెడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వైవీ రావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ఒక ఉచిత బస్సును మాత్రం ప్రభుత్వం అమలు చేస్తుందని గుర్తు చేశారు. కానీ, బస్సుల సంఖ్యను కుదించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత పార్టీ అన్నారు. నెలకు ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆమాట ఎత్తడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటించలేదన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిబద్ధతతో పనిచేస్తున్న ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భూక్యా సంగీత, ధర్మారపు వెంకన్న, బుల్లెట్ కృష్ణ, లింగంనాయక్, కట్టోజ్ గంగాధర్, పాల్వాయి భాస్కర్, అనిల్‌నాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రమిచ్చిన సోనియా రుణం తీర్చుకుందాం

- తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మరిపెడ, మే 23 : కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. గురువారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల సమావేశం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల హాజరై మాట్లాడారు. గత పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై నిత్యం మీడియా ద్వారా పోరాటం చేసిన తీన్మార్ మల్లన్నకు ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరు మొదటి ప్రాధాన్యత ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతలు రైతులను పదేళ్ల కుదేలు చేసి ఇప్పుడు వారి పక్షాన మాట్లాడడం హేయంగా ఉందన్నారు. ప్రపంచ మార్కెట్‌లో మంచి గుర్తింపు ఉన్న సన్నవడ్ల పంట ఉత్పత్తులను పెంచుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.500 బోనస్ ఇస్తే ప్రతిపక్షాలు ఓర్చుకోలేక పోతున్నాయన్నారు. దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో రైతులకు పంట బీమా పథకం వర్తింపచేసే యోచన చేస్తున్నామన్నారు. రైతుల ప్రీమియం డబ్బు కూడా ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుడి వలే పనిచేసి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం తప్పు చేస్తే తీన్మార్ మల్లన్న ప్రశ్నించొచ్చని అన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు ఆర్.రఘురాంరెడ్డి, బలరాంనాయక్ మాట్లాడారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ ఇచ్చి ప్రత్యేకతను చాటుకుందామని అన్నారు. కేసీఆర్ నియంత పాలనపై కాంగ్రెస్ పార్టీతో పాటు తీన్మార్ మల్లన్న ఈ పదేళ్ల పోరాటం చేశారని, చివరకు జైలుకెళ్లాడని గుర్తుచేశారు. ఆయనను చట్టసభలకు పంపడం యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీగా ఎన్నికైతే ప్రజలకు, ప్రభుత్వానికి వారిధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పారదర్శక పాలనకు మంత్రి తుమ్మల మాటలే సాక్ష్యమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తప్పుచేస్తే ప్రశ్నించాలని చెప్పడం ఆపార్టీ ప్రజా పాలనకు నిలువుటద్దమని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక అంటూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి, నూకల నరేశ్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గంధసిరి అంబరీశ, కాలం రవీందర్‌రెడ్డి, తాజుద్దీన్, అప్సర్, అంబటి వీరభద్రం, కమలాకర్, గుగులోత్ రవి, అఫ్జల్, ఐలిమల్లు, మెంచు అశోక్, హన్మ, మాదా శ్రీనివాస్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, బట్టునాయక్, రాజశేఖర్, వెంకటసాయి, సురేశ్ పాల్గొన్నారు.

2లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ ఏది?

- జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా మొండిచేయి
- పెద్దల సభకు విద్యావంతులను పంపాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్, మే 23 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ ఏమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం తొర్రూరు మండలం వెల్లికట్ల గ్రామ శివారులో పాలకుర్తి నియోజకవర్గ పట్టభద్రులతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీష్‌రావు మాట్లాడుతూ అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ బాండ్ పేపర్లు ఇచ్చిందని, అవి చెక్కుల మాదిరిగా బౌన్స్ అయినట్లు ఆరోపించారు. చెక్కులు బౌన్ అయితే కేసులు పెట్టి శిక్షించే విధంగా వారిని శిక్షించాలన్నారు. ఎన్నికల ముందు రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా ముందుకు పడలేదన్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని, రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేస్తామంటూ బోగస్ మాటలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం 24గంటల కరెంట్, రూ.500 బోనస్ ఇవ్వకుండా సంబంధిత ఉద్యోగులను వేధిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి 30వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హరీష్‌రావు అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు పెద్దల సభకు విలువలు కలిగిన విద్యావంతులను పంపించాలన్నారు. విద్యావంతుడు, సేవాగుణం కలిగిన రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలను పట్టభద్రులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ చేతుల్లో పెట్టడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయన్నారు. ఐదు నెలలైనా ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్, డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి, ఉద్యోగులకు పీఆర్సీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. విచక్షణ కలిగిన పట్టభద్రులు బ్లాక్ మెయిల్ ఎవరో... మంచి ఎవరో ఆలోచించి ఓటు వేయాలన్నారు. రాకేష్‌రెడ్డి గెలుపు ఖాయమైందని చెప్పారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లలో దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి చేసిన కేసీఆర్ పాలన, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 100 రోజుల పాలన చూసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

హక్కుల కోసం పోరాడుతా : రాకేష్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి అన్నారు. ఎంతో మంది మేధావులు, పెద్దలు కూర్చునే పెద్దల సభకు ప్రభుత్వానికి తొత్తులుగా మారిన వారిని గెలిపిస్తారో.... మీవాడినై హక్కుల కోసం పోరాటం చేసే తనను గెలి పిస్తారో మేధావులు ఆలోచించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు మధుసూదనా చారి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, చల్లాడ లక్ష్మీనర్సింహారావు, గాంధీనాయక్, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, డాక్టర్ సోమేశ్వర్ రావు, బిల్లా సుధీర్‌రెడ్డి, గాంధీనాయక్, సీతారాములు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, పట్టభద్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు షాకివ్వాలి
- రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత పట్టభద్రులదే..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
7

నేడు పాలిసెట్

- హాజరు కానున్న 1604 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ



మహబూబాబాద్ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శోభారాణి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 23 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని వరంగల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ శోభారాణి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష కేంద్రాలను గురువారం సందర్శించి చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లతో పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అర్హత పరీక్షకు 1,604 మంది విద్యార్థులు హాజరు కానుండగా, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తక్షశిల హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, శ్రీచైతన్య ఈ టెక్నో స్కూల్ సెంటర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే పరీక్షకు విద్యార్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైనా సెంటర్‌లోనికి అనుమతించబడదని తెలిపారు.


రేపే బ్రహ్మాండమైన విడుదల
చిత్రంతో పునఃప్రారంభమవుతున్న థియేటర్స్
అన్ని థియేటర్లలో అడ్వాన్స్ బుకింగ్ ఇవ్వబడును



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30

సంగీత ఎ/సి - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
ఈశ్వర్ ఎ/సి - అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00
శివశక్తి ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00
శ్రీలక్ష్మి/ఇంద్రసేన - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30
భ్రమరాంబ 70 ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45
కోణార్క్ 70 ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
విశ్వనాథ్ 70 ఎ/సి - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
శ్రీసాయిరాం 70ఎ/సి - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00

నేడే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00,2.00
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.40am
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 5.35pm
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 2.05pm
ఎస్2 నోవా - మల్లాపూర్ 7.10pm
జిఎస్ఎమ్ - మదీనగూడ 5.05pm
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 11.05am
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.50am
సినీ ప్లానెట్ - కొంపల్లి 1.30pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.35pm
మిరాజ్ సినిమాస్ - బాలానగర్ 12.10pm
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 11.35pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.35pm
LIGHTHOUSE CINE MAGIC 9246547212

నేడే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం - నారాయణగూడ 6.00,9.00
వెంకటసాయి 70ఎంఎం - కీసర 11.00,2.00,6.00,9.00
లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్ 2.40pm
SRI LAKSHMI PICTURES RELEASE 9885291789

నేడే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15
విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
CONTACT: 7799172022

విజయవంతమైన 2వ వారం



లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్ 11.30am
NTR CINEMAS & RUSHIKESHWAR FILMS 9030161717, 9849076540



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన సీపీ


వరంగల్ సిటీ, మే 23: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఏనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను అకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతను, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పని తరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, ఏనుమాముల సీఐ పులి రమేష్ ఉన్నారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల




దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.15,6.00,9.15
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 12.05pm
పివిఆర్ - కూకట్‌పల్లి 11.00am
జిఎస్ఎమ్ - మదీనగూడ 11.00am
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.15pm
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 11.15am
జె.పి.సినిమాస్ - చందానగర్ 4.35pm
SUCHIN CINEMAS THRO NTR CINEMAS 9030161717

నేడే బ్రహ్మాండమైన విడుదల



సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.35pm
జిఎస్ఎమ్ - మదీనగూడ 2.20pm
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 11.05am
11.15am
SKML MOTION PICTURES Through GANESH BHARI 9296509333

విజయవంతమైన 4వ వారం



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00
మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట 11.15,2.30,6.15,9.45
GLOBAL CINEMAS LLP

నిలిచిన ప్రగతి

ఎన్నికల కోడ్‌తో పేరుకుపోయిన ప్రజా సమస్యలు

పెండింగ్‌లో ధరణి దరఖాస్తులు

జూన్ 6 తర్వాతే ప్రజావాణి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హనుమకొండ కలెక్టరేట్, మే 23: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వలన జిల్లాలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వరంగల్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తోపాటు ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో ప్రజల సమస్యలు పేరుకుపోయాయి. లోక్‌సభ ఎన్నికలకు మార్చి 16వ తేదీన ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అప్పటి నుంచి జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. జిల్లాకు అభివృద్ధి పనుల నిధులు జూన్ 6 తర్వాతే విడుదల అవుతాయి.

పెండింగ్‌లో దరణి దరఖాస్తులు

ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కారమయ్యేందుకు ప్రభుత్వం ఎన్నికల ముందు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే కోడ్ కారణంగా ప్రత్యేక దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లకు తాత్కాలికంగా విశ్రాంతి ఇచ్చి సిబ్బందిని లోక్‌సభ ఎన్నికల విధులకు వాడుకున్నారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం ధరణిలోని పలు నిబంధలను సవరిస్తున్నారు. గ్రీవెన్స్ ఆన్‌ల్యాండ్ మ్యాటర్స్(జీఎల్‌ఎం) ద్వారా వచ్చిన దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రజావాణి జూన్ 6 తర్వాతే..

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న జూన్ 6వ తేదీ వరకు నిలిపివేశారు. ఈ ప్రజావాణిలో వివిధ సమస్యలను ప్రజలు నేరుగా కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టరేట్‌లకు విన్నవించేవారు. ఈ కార్యక్రమానికి వస్తే మా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఎంతో ఆశతో వచ్చేవారు. సమస్యలపై కొందరు ప్రజలు కలెక్టరేట్‌కు రోజు వస్తున్నప్పటికీ కలెక్టర్ కలవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మూడు నెలల నుంచి ప్రజావాణి కార్యక్రమం రద్దు కావడంతో వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న ప్రజలు కలెక్టర్‌ను కలవడానికి సోమవారం కాకుండా వేరే రోజు వచ్చినప్పటికీ కలెక్టర్ కలవకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రజావాణి ద్వారా ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించే మంచి అవకాశం కల్పించినప్పటికీ లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్ల సమస్యలు పరిష్కారం కాలేకపోతున్నాయని కొందరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తనిఖీ నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి బృందం సభ్యులు

నకిలీ కంటి ఆస్పత్రిలో తనిఖీలు

వరంగల్ మెడికల్, మే 23: తెలంగాణ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు వరంగల్ పట్టణంలోని జేపీఎన్‌రోడ్‌లోని డెక్కన్ ఆప్టికల్స్‌లో డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి బృందం గురువారం తనిఖీ లు నిర్వహించింది. ఆప్టోమెట్రిలో డిప్లొ మా చేసిన ఎం.జనార్దన్.. అందులో డాక్టర్లుగా వ్యవహరిస్తూ కంటి చూపు సంబంధించిన పరీక్షలు చేయడంతోపాటు డాక్టర్‌గా ప్రిస్క్రిప్షన్‌పై మందులు, కంటి చుక్కల మందులు రాస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీ నివేదికను హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య మండలికి పంపనున్నారు. డిప్లొమా ఆప్టోమెట్రీ చేసినవారు డాక్టర్ కాదని, మందులు రాయకూడదని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ సూచించారు. తనిఖీ బృందంలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, వరంగల్ హెచ్ఆర్‌డీఏ కోశాధికారి డాక్టర్ శివ్వా సృజన్, అనంతుల అన్వేష్ ఉన్నారు.

రోలర్‌లో పడి కార్మికుడి మృతి



మృతిచెందిన మంజునాథ్‌యాదవ్

గీసుగొండ, మే 23: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని గణేషా ఎకోటెక్ కంపెనీలో పీఎస్‌ఎఫ్ రోలర్‌లో పడి మంజునాథ్‌యాదవ్(23) అనే కార్మికుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం. ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ పట్టణం రసూల్‌పూర్‌కు చెందిన మంజునాథ్ యేడాదిగా గణేష్ ఎకోటెక్‌కంపెనీలో పీఎస్‌ఎఫ్ రోలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ప్లాస్టిక్ దారాలు రోల్ అవుతున్నప్పుడు ఎక్కడైనా చిక్కులుపడి చుట్టుకుంటే వాటిని సరిచేస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి రోలర్‌లను ఆపరేట్ చేస్తూ చిక్కుపడిన దారాలను కట్ చేస్తుండగా చేయి రోలర్‌లోకి లాక్కోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంజనాథ్‌ను 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ విషయాన్ని యాజమాన్యాన్ని వివరణ కోరగా మృతి చెందినది వాస్తవమేనని, మృతుడి కుటుంబీకులకు సమాచారాన్ని అందించినట్టు పేర్కొంది. యూపీ నుంచి వారు రావటానికి ఫ్లైట్ టికెట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపరిచారు. కాగా, బుధవారం ఉదయం కార్మికులను తీసుకువచ్చే మినీబస్ ఢీకొని గణేషా కంపెనీలో పనిచేసే కార్మికుడు ఏనుగల్ గ్రామానికి చెందిన జిలానిపాషకు గాయాలయ్యాయని తెలిపారు. అతడిని కూడా చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. అయితే కంపెనీలో పనిచేసే వారందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, మే 23: దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూరు ప్రాంతంలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. గురువారం నిర్వహించిన దాడిలో రూ.50వేలనగదు, ఐదు మోటార్ సైకిళ్లు, ఏడు స్మార్ట్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐలు రవికుమార్, దయాకర్‌లు ధ్రువీకరించారు.

విజయవంతమైన 4వ వారం



ఏ.ఎం.బి. సినిమాస్ - గచ్చిబౌలి 10.20,7.10
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 5.00pm
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 2.20pm
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 6.40pm
మంజీరామాల్ - కూకట్‌పల్లి 1.50,5.05
మంత్రామాల్ - అత్తాపూర్ 4.50pm
డిఎస్‌ఎల్ మాల్ - ఉప్పల్ 1.45,4.50
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.40pm
ఎంజిఆర్ సినిమాస్ - నల్లగండ్ల 10.40pm
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 2.45,9.30
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.30pm
GLOBAL CINEMAS LLP

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు షాకివ్వాలి

పట్టభద్రులపై రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

జనగామ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా షాకివ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఖమ్మం పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో జనగామలో ఆయన కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు బీఆర్ఎస్, ఆరు నెలలుగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీ అమలుపై కూడా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఆగస్టుకు వాయిదా వేశారని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రుణమాఫీ చేయకపోవడంవల్ల బ్యాంకులు కొత్తగా రుణాలను ఇవ్వడం లేదన్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, వాటి డీఎన్ఏ కూడా ఒక్కటేనని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని ప్రజలు భావించారని, అయినా ఏ మార్పు రాలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా అయిందని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పీడ విరగడ కావాలని కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఆపార్టీ కూడా బీఆర్ఎస్ బాటలోనే పోతోందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీతో హామీలు ఇప్పించి ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. దేవుళ్ల పేరు మీద ఒట్లు వేస్తూ ప్రజలను ముంచుతున్నారని మండిపడ్డారు. వడ్లకు బోనస్ ఇస్తానని చెప్పి కేవలం సన్న వడ్లకే అని మాట మార్చడం ఏంటని ప్రశ్నించారు. సన్న, దొడ్డు తేడా లేకుండా అన్ని రకాల వడ్లను కొనడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ బోనస్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వానికి నొప్పి ఏంటని నిలదీశారు. బోనస్ నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నరకాన్ని ప్రోత్సహించాలనుకుంటే అవసరమైతే క్వింటాకు రూ. 1000 బోనస్ ఇవ్వాలని, కానీ ఇచ్చిన మాట ప్రకారం దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు కరవు భత్యాన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు డీఏలను చెల్లించలేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగుల డీఏ, పీఆర్‌సీ పెండింగ్, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్ సర్కారుకు పట్టింపు లేకుండా పోయిందని అన్నారు. గత ప్రభుత్వ పథకాలను అమలు చేస్తారా, తొలగిస్తారా అన్న దానిపై స్పష్టత లేదని అన్నారు. ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుంటారన్న దానిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక అవగాహన అంటూ లేదని, ఇలాగే కొనసాగితే రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులు, మేధావులు, ఉద్యోగులపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, సౌడ రమేశ్, మహంకాళి హరిశ్చంద్రగుప్త, శివరాజ్‌యాదవ్, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం అభివృద్ధిపై రోజూ సమీక్ష

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఎంజీఎం ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, మే 23: పేదల ఆస్పత్రి ఎంజీఎం అభివృద్ధిపై లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రతీ రోజు ఒక గంట కేటాయిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. 'పెద్ద ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు' అనే కథనం గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి స్పందించారు. గురువారం ఉదయం ఎంజీఎంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎంజీఎం పనితీరు మెరుగుపర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎంజీఎంలో పరికరాల మరమ్మతు కోసం ఆయా సంస్థ ప్రతినిధులు స్పందించకపోతే పోలీసు కేసు నమోదు చేయాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిపై కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపాలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గంటలు కరెంట్ పోతేనే గగ్గోలు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. కేసీఆర్ వరంగల్‌లో మకాం వేసి ఇచ్చిన హామీలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఆ హామీలు నెరవేర్చనందుకే వారిని ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగులు కూడా స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వహిస్తూ నిర్లక్ష్యాన్ని పక్కనపెట్టాలని నాయిని విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు ఎమ్మెల్యే నాయిని ఓపీ బ్లాక్ పరిశీలించి అక్కడ నుంచి రక్తనిధి కేంద్రానికి చేరుకున్నారు. రక్తనిధి కేంద్రంలో మూలనపడ్డ ప్లేట్‌లెట్ సపరేట్ మిషన్ ఎందుకు బాగు చేయడం లేదని ప్రశ్నించారు. మార్చురీలో దుర్గంధం రావడంపై ప్రశ్నించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా అసౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కొన్ని ల్యాబ్ పరీక్షలను బయటికి పంపిస్తున్న దృశ్యాన్ని స్వయంగా గమనించారు. రేడియాలజీ విభాగంలో రెండు ఎక్స్‌రే మిషన్లు పనిచేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఆర్ఎంలు డాక్టర్ మురళి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం అడ్డగోలు హామీలిచ్చి ఆగం చేస్తున్నాడు..

ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్



మీడియాతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

హనుమకొండ టౌన్, మే 23: శాసన సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు లక్షల కోట్లు ఖర్చు అయ్యే హామీలిచ్చి సీఎం అయ్యాక అమలుపరచకుండా ప్రజలను రేవంత్‌రెడ్డి ఆగం చేస్తున్నాడని బీజేపీ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన పార్టీ ఒకటైతే.. 10 యేళ్లు అధికారంలో ఉండి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దిగజార్చిన పార్టీ మరొకటని దుయ్యబట్టారు. నిరంతరం ప్రజల పక్షాన కొట్లాడే బీజేపీ పార్టీని పట్టభద్రుల ఎన్నికల్లో ఆదరించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్ అధికారంలో రాగానే డిసెంబర్ 9న ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని ఘంటాపథంగా చెప్పిన రేవంత్‌రెడ్డి.. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏ విధంగా మాట మార్చాడో ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రశ్నించే గొంతుకను ఆదరించండని కాంగ్రెస్ అభ్యర్థి చెబుతున్న మాటలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు. అధికార పార్టీ అభ్యర్థి అయి ఉండి ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నిస్తాడని అన్నారు. మా తప్పులను బయటకు తీయకండి.. మీ తప్పులను ఎత్తిచూపం.. అని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాక ఆ పార్టీల అభ్యర్థులను శాసన మండలికి పంపిస్తే సమస్యలపై ఎలా ప్రశ్నిస్తారనేది మేధావులు ఆలోచన చేయాలన్నారు. శాసనసభలో 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు అధికార పార్టీని సమస్యలపై ఎలా నిలదీస్తున్నారో.. అదే రీతిలో శాసనమండలిలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ప్రశ్నిస్తారన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, పట్టభద్రులను ఓటు అడిగే నైతిక హక్కు ఆ పార్టీలకు లేదని విమర్శించారు. 10 యేళ్లలో బీఆర్ఎస్ భూములు, మద్యం అమ్ముకొని ఖజానా నింపుకుంటే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పని చేస్తోందని ఎద్దేవా చేశారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ రూ.14,000కోట్ల అప్పు చేసిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంటే.. కాంగ్రెస్ హయాంలో ప్రతీ మంత్రి దోచుకొని దాచుకుంటున్నారన్నారు. దోచుకున్న దాంట్లో కొంత ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రెండు ఉపఎన్నికలు వచ్చాయని, కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ మటుమాయవుతుందని, కాంగ్రెస్ ఓడిపోతుందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం అవే ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు. పెద్దల సభలో బ్లాక్ మెయిలర్‌కు అవకాశం ఇవ్వొద్దని, నీతి, నిజాయితీతో 40 యేళ్లగా నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న ప్రేమేందర్‌రెడ్డిని మేధావులు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మురళీధర్, సరోత్తమ్ రెడ్డి, కొండి జితేందర్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో విద్యుత్ అధికారుల పరిశీలన

ఎంజీఎం ఘటనతో చలనం



ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా గురించి తెలుసుకుంటున్న ఎస్ఈ వెంకటరమణ

హనుమకొండ టౌన్, మే23: ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం నిలిచిపోయిన విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఎన్పీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉన్న ప్రసూతి ఆస్పత్రులు, పీహెచ్‌సీ కేంద్రాలు, వివిధ ప్రత్యేక విభాగాలను ఏఈ స్థాయి నుంచి ఎస్ఈ స్థాయి అధికారుల వరకు కేటగిరీలుగా విడిపోయి సందర్శించారు. ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్, జనరేటర్లను పరిశీలించి వాటి మెయింటెనెన్స్ కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ముందుస్తుగానే తమ దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి అందిన 'ఎంజీఎం' నివేదిక

వరంగల్ మెడికల్, మే 23: ఈనెల 21న వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పడిన విద్యుత్తు అంతరాయంపై ప్రభుత్వం ఆదేశించిన విధంగా నివేదికను అందించినట్లు ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కరెంటు అంతరాయంపై ఎన్పీడీసీఎల్ బృందం లైన్‌లను తనిఖీ చేసిందన్నారు. బ్రేకర్లో లోపం ఉందని, ప్రధాన సబ్‌స్టేషన్‌కు హెచ్‌టీ లైన్ జంపర్‌లు లూజ్ కాంటాక్ట్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఔట్ పేషెంట్ బ్లాక్‌లకు సరఫరా చేసే ఇతర సబ్ స్టేషన్ లైన్లలో ఎటువంటి లోపం లేదని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఔట్ పేషెంట్‌లకు సరఫరా చేసే సబ్‌స్టేషన్ లైన్లకు సరఫరాను పునరుద్ధరించి ఆపై హెచ్‌టీ లైన్ జంపర్‌లను రిపేర్ చేసి విద్యుత్ సరఫరా అందించారని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రిలోని జనరేటర్లపై అత్యవసర ప్రాంతాలైన ఎమర్జెన్సీ, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ఎంసీహెచ్ వార్డులకు విద్యుత్ సరఫరాను అందించామని తెలిపారు. రోగుల సంరక్షణకు ఎలాంటి అసౌకర్యాలు కలగలేదని రామ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మృతుడు భూపాలపల్లి జిల్లా వాసి






ఆత్మహత్య చేసుకున్న బర్ల హరీష్ (20)

రఘునాథపల్లి, మే 23: చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి గ్రామ శివారులో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన బర్ల హరీష్ (20) అనే యువకుడు తన తండ్రి బర్ల సదయ్యతో వరి ధాన్యం పట్టించే విషయంలో గొడవ పడి బుధవారం తన మోటారు సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. మోటారు సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరిన హరీష్ తండ్రితో జరిగిన గొడవతో మనస్తాపానికి గురై మండలంలోని గోవర్ధనగిరి గ్రామ శివారులోని దొంతుల సమ్మయ్య వ్యవసాయ భూమి వద్ద ఉన్న చింత చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు గురువారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఇతర ఆధారాలతో భూపాలపల్లి జిల్లా వాసిగా గుర్తించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలంలో ఉన్న మోటారు సైకిల్‌లో ఒక బీరు బాటిల్‌తో పాటు రెండు రకాల పురుగుల మందు డబ్బాలు ఉన్నాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

జనగామ కల్చరల్, మే 23: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కాజీపేటకు చెందిన రౌతు దయాకర్ (47) కాజీపేట లోకోషెడ్‌లో డీజిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. తాగుడుకు బానిసై, మానసిక వేదనతో గురువారం జనగామ రైల్వేస్టేషన్‌లో ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్లే గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి దరఖాస్తు తీసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జనగామ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి, కానిస్టేబుల్ సీహెచ్.నరేష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఐటీ'లో ఇష్టారాజ్యం



బల్దియాలో ఐటీ విభాగం కార్యాలయం

- ఔట్‌సోర్సింగ్ గుప్పిట్లో బల్దియా సాంకేతిక విభాగం
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే కార్పొరేషన్ డాటా
- కార్పొరేషన్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

వరంగల్ కార్పొరేషన్, మే 23: వరంగల్ నగర పాలక సంస్థ సాంకేతిక విభాగాన్ని బల్దియా ఉన్నతాధికారులు గాలికి వదిలేసినట్టు తెలుస్తోంది. ఐటీ విభాగంతో పాటు దానికి అనుబంధంగా పనిచేస్తున్న ఈ- సేవా కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన పన్నులు, పథకాలు, నిర్మాణాలు, సిబ్బంది పూర్తి వివరాలు, లెక్కలు, బిల్లులు, రాబడి, పోబడి అంతా ఐటీ విభాగంలో నిక్షిప్తమై ఉంటుంది. అయితే చాలా కాలంగా కార్పొరేషన్ ఐటీ విభాగానికి ప్రభుత్వ అధికారి పర్యవేక్షణ బాధ్యత లేకుండాపోయింది. బల్దియా శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, మలేరియా, హార్టికల్చర్, వెటర్నరీ విభాగాలను అధికారులు సమర్థవంతంగా నడిపిస్తున్నారు. కానీ బల్దియా ఐటీ విభాగాన్ని మాత్రం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో అక్కడి సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా నడుస్తోంది. ఉదయం వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసుకున్న తర్వాత కంటికి కనిపించకుండా పోతారనే ప్రచారం ఉంది.

ఇష్టారాజ్యం

నగర పాలక సంస్థ ఐటీ విభాగంలో 14 యేళ్లుగా ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాజ్యమేలుతున్నారు. ఈ శాఖలోకి మరే ప్రభుత్వ అధికారి చొరబడకుండా గత కమిషనర్, మేయర్లను తప్పుతో వపట్టించి ఐటీ శాఖను గుప్పిట్లో పెట్టుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక్కడ సిబ్బందిని తొలగించాలన్నా, నియమించుకోవాలన్నా ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేతుల్లో ఉందని తెలుస్తోంది. అంతేకాకుండా కార్పొరేషన్ పరిధిలో కంప్యూటర్‌లకు సంబంధించిన పరికరాలు కొనుగోలు చేయాలన్నా.. ఆయన కనుసన్నల్లోనే ఉంటుందని సమాచారం. ఈ క్రమంలో నాసిరకం సామగ్రి కొనుగోలు చేసి నకిలీ బిల్లులు సృష్టిస్తున్నట్లు కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ శాఖపై ఔట్ సోర్సింగ్ వ్యక్తి పెత్తనం సాగుతుండడంతో అలాగే బల్దియాలో డాటా సైబర్ నేరస్తుల చేతికి వెళ్లడంతో పాటు అక్రమాలు జరిగే ప్రమాదం ఉంది. ఇంకా కార్పొరేషన్‌కు సంబంధించిన పూర్తి డాటాను ఓ వ్యక్తి బయటి వ్యక్తులకు, సైబర్ నేరగాళ్లకు చేరవేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇక్కడ జరుగుతున్న అక్రమాలను తెలుసుకున్న హైదరాబాద్ ఐటీ అధికారులు.. వరంగల్ బల్దియా డాటా, పాస్‌వర్డ్‌ను వారి వద్ద భద్రపరిచినట్టు సమాచారం.

కమిషనర్ దృష్టి సారించాలి..

నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కొనసాగుతున్న ఐటీ విభాగాన్ని పర్యవేక్షించేందుకు, అక్కడ పని చేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నడిపించేందుకు ఓ ప్రభుత్వ ఉన్నతాధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. బల్దియా ఐటీ విభాగం అదుపు తప్పకుండా ఉండాలంటే ఉన్న ఉద్యోగులపై ఒక ప్రభుత్వ పర్యవేక్షణ అధికారి ఉండాలని కొందరు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. కనీసం సూపరింటెండెంట్ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉన్నా.. ఇక్కడ జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో కమిషనర్ దృష్టి సారించాలని నగర పౌరులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడ్డదారిలో నియామకాలు

గ్రేటర్ నగర పాలక సంస్థలో గతంలో ముగ్గురు మాత్రమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐటీ విధులు నిర్వర్తించే వారు. కానీ 2020లో అప్పటి పాలక వర్గంలో ఓ నేత కొందరు వ్యక్తులను చేరదీసి కంప్యూటర్ శిక్షణ ఇప్పించాడు. 8 మంది నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు దండుకోవడంతో పాటు ఇన్సూరెన్స్ పేరుతో మరికొంత డబ్బు తీసుకుని ఐటీలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పెట్టించాడని తెలిసింది. ఇంకా శానిటేషన్ విభాగంలో పీహెచ్ (ఫిజికల్ హెల్త్) వర్కర్ల కొరత ఉందని 452 మందిని అడ్డదారిలో చేర్చుకున్నారు. వారిలో కొందరు శానిటేషన్ పనులు చేపట్టకుండా ఐటీతో పాటు ఈ-సేవా కేంద్రాల్లో ఆపరేటర్లుగా, బిల్ కలెక్టర్లుగా పని చేస్తూ పని తప్పించుకుంటున్నారు. దీంతో శానిటేషన్ సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. అయితే ఈ-సేవల్లో పని చేసే సిబ్బందికి నెలకు వచ్చే జీతాలతో పాటు ట్యాక్సీలు చెల్లించడానికి వచ్చిన వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు ప్రజలు వెల్లడించారు.

ఇంజనీరింగ్ ప్రవేశాలను ప్రోత్సహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలను ప్రోత్సహించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కేయూలోని కమిటీ హాల్‌లో కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్‌రాజుతో పాటు బోధన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగానే కొత్తగూడెం కళాశాలను మొదటి ప్రాధాన్యత క్రమంలో మొదటి ఎంపికగా ఉండే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ ఇతరత్ర వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం. సదానందం, డీన్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్ హనుమంతు, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకులు ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు మహ్మద్ హబీబుద్దీన్, డాక్టర్ కోల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూలో మెస్ మూసివేయొద్దని పీడీఎస్‌యూ విద్యార్థుల ఆందోళన

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కాకతీయ యూనివర్సిటీలోని మెస్సులను మూసివేయాలని హాస్టల్స్ డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆందోళనకు దిగింది. గురువారం కేయూలోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భగా సంఘం వర్సిటీ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ... త్వరలో గ్రూప్స్, డీఎస్సీతో పాటు అనేక రకాలైన పోటీ పరీక్షలు జరుగున్న నేపథ్యంలో హాస్టళ్లను మూసివేస్తాననడం తగదన్నారు. మెస్‌ను మూసివేస్తామన్న సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పరిపాలన భవనాన్ని ముట్టడించి రిజిస్ట్రార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చిన హాస్టల్స్ డైరెక్టర్ సమ్మయ్య హాస్టల్స్‌ని మూసివేయమని హామి ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వినయ్, రాజు, శ్రవణ్, అర్జున్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్‌లో సంజీవ్‌కు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధకుడు ఎన్.సంజీవ్‌కు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మహ్మద్ ముస్తాఫా గురువారం డాక్టరేట్‌ను ప్రకటించారు. ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి పర్యవేక్షణలో 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా - ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్ అనే పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను నవీన్‌కు డాక్టరేట్‌ను ప్రకటించారు.

జయప్రకాశ్ క్రికెట్ ట్రోఫీ విజేత జనగామ



విజేత జనగామ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, మే 23: మూడురోజులుగా ఎల్‌బీ కాలేజీలో నిర్వహిస్తున్న జయప్రకాశ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటులో గురువారం జరిగిన జనగామ వర్సెస్ ములుగు జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో 79 పరుగులతో జనగామ జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ క్రికెట్ పోటీల్లో ఫైనల్‌లో జరిగిన జనగామ, ములుగు మధ్య జరిగిన ఫైనల్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జనగామ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు గాను 7 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. జనగామ జట్టు ఓపెనర్ ప్రదీప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కేవలం 42 బంతులు ఎదుర్కొని ఒక సిక్స్, 9 బౌండరీల సాయంతో 58 పరుగులు జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. తదుపరి బరిలోకి దిగిన ములుగు జిల్లా జట్టు 20 ఓవర్లు ఎదుర్కొని 10 వికెట్ల నష్టానికి 126 పరుగులు మాత్రమే చేసి 79 పరుగుల తేడాతో ఓటమి పాలయింది.

కాగా, జనగామ జిల్లా జట్టు బౌలర్ అనురీత్ నాలుగు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపిక అయ్యాడు. మూడు రోజులు నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న క్రీడా పోటీల్లో క్రీడాకారులు నువ్వా నేనా అన్న తీరుగా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇక్కడ జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 24 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్ జిల్లాస్థాయి బాలుర టీ 20 సీనియర్స్ క్రికెట్ విభాగంలో పాల్గొననున్న క్రీడాకారులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పంటల అధిక దిగుబడులు



కురవిలో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఈవో మంజుఖాన్

కురవి, మే 23: పచ్చిరొట్ట, జీలుగ, పిల్లిపెసర వేసి, కలియదున్నడం ద్వారా పంట దిగుబడులు అధికంగా వస్తాయని కురవి వ్యవసాయాధికారి మంజుఖాన్ అన్నారు. కురవిలో గురువారం పచ్చిరొట్ట, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30కిలో జీలుగ విత్తనాలు సబ్సిడీ పోను రూ.1116 చెల్లించాలని, అదే విధంగా 20 కిలోల పిల్లిపెసర విత్తనాలు రూ.1084 చెల్లించి రైతులు తీసుకోవా లన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ తప్పక తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పున్నమి, ఆగ్రోస్ సీఈవో రాధాకృష్ణ, రైతులు మేక దామోదర్ రెడ్డి, బుడమ రవి, బత్తిని వీరన్న, కానుగంటి సత్యనారాయణ, నాగయ్య, కానుగంటి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

గూడూరు, మే 23 : సిండికేట్‌గా ఏర్పడి మద్యం దుకాణాల్లో సరుకు లేకుండా చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. గూడూరు మండల కేంద్రంలోని మద్యం షాపు ముందు బీజేపీ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం షాపుల్లో సరుకు లేకుండా గ్రామాల్లోని బెల్టుషాపులను ప్రోత్స హిస్తూ మద్యం తరలిస్తున్నారని పేర్కొన్నారు. వైన్స్‌షాపుల్లో మద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతికి అందజేశారు.కార్యక్రమంలో చెవులపల్లి దేవేందర్‌రావు, పానుగంటి వీరస్వామి, నాగరాజు, ఐలయ్య, రమేష్, అనిల్ పాల్గొన్నారు.

వేతనాలు అందించాలని డీఎంహెచ్‌వోకు వినతి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

నెహ్రూసెంటర్, మే 23 : నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రెండు నెలల వేతనం చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రుక్మొద్దీన్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి కళావతిబాయికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రుక్మొద్దీన్ మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వేతనాలను ఆపడం బాధాకరమన్నారు. రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉద్యోగులకు వేతనాలు అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంజీవ్‌నాయక్, రఘునాథ్, కరుణాకర్ పాల్గొన్నారు.

చేపల లారీ బోల్తా.. ఎగబడిన జనం

దంతాలపల్లి, మే 23 : ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై గల దంతాలపల్లి మండల కేంద్రం శివారులో గురువారం చేపల లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. లారీలో ఉన్న చేపల కోసం జనం ఎగబడ్డారు. దీంతో స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రజలను చెదరగొట్టారు. ఈ చేపల లారీ లోడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుడివాడ నుంచి గుజరాత్‌లోని అలహాబాద్‌కు వెళ్లేక్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

పట్టభద్రుల గొంతుకనవుతా



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



వెల్లికట్టెలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న
- జిల్లాలో విస్తృత ప్రచారం

మహబూబాబాద్ టౌన్, మే 23 : పట్టభద్రులు తనను ఆశీర్వదిస్తే శాసన మండలిలో అడుగుపెట్టి వారి గొంతుకనవుతానని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మహబూబాబాద్‌లోని బాలాజీ గార్డెన్స్‌లో కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరం చుట్టూ భూములను, రాష్ట్ర సంపదను మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం కొల్లగొట్టారని అలాంటి వారు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. చీకటి వ్యవహారాలు, దందాలకు కేరాఫ్‌గా నిలిచిన కేటీఆర్ ఆటలు ఇక సాగవని చెప్పారు. కేటీఆర్ సోదరి ఎమ్మెల్సీ కవిత జైలుకెందుకు పోయిందో చెప్పాలన్నారు. మానుకోట ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ మాట్లాడుతూ గతంలో రెండవ స్థానంలో నిలిచిన తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ మద్దతుతో ఈసారి అఖండ మెజారిటీతో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు గురువారం ఉదయం మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్‌ను కలిసి మాట్లాడిన తీన్మార్ మల్లన్న పట్టభద్రుల ఓటును వృథా చేయనని, కాంగ్రెస్ మెనిఫెస్టో అమలుకు కృషి చేస్తానని చెప్పారు.

● తొర్రూరు రూరల్ : తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పాలకుర్తి నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నిత్యం ప్రజల పక్షంలో ఉండి ప్రజల గొంతుకనై ప్రశ్నిస్తున్న తాను రాజకీయాల్లోకి వస్తే తన ఆస్తులు ప్రభుత్వానికి ఇస్తానని చెప్పిన మాటకు కట్టుబడి వచ్చానన్నారు. చెప్పారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వకుండా, ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేసిన బీజేపీని, పేపర్ లీకులు చేసి నిరుద్యోగులను బలితీసుకున్న బీఆర్ఎస్ పార్టీలను పట్టభద్రులు నమ్మనడం లేదన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పదునైన ప్రశ్నలతో ప్రభుత్వాలను నిలదీసే తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమైందన్నారు. నిరుద్యోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న తరపున పలువురి ప్రచారం

గార్ల : వరంగల్, ఖమ్మం, నల్లగొండ, పట్టభద్రుల ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తరపున పలువురు నేతలు ప్రచారం నిర్వహించారు. గురువారం గార్ల మండల కేంద్రంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రచారం నిర్వహించి ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. గత పాలకులు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు.

● గూడూరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటిప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కపిల్‌వాయి దిలీప్‌కుమార్ పిలుపునిచ్చారు. గూడూరు మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను ఉద్యోగాలు రాలేదన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ సభ్యులు కత్తి వెంకటస్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

● కేసముద్రం : డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి కేసముద్రంలోని ఎస్‌వీవీ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. టీజేఎస్ మండల అధ్యక్షుడు బాణాల నాగరాజుతో కలిసి పర్యటించిన ఆయన ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువరు అధ్యాపకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

మల్లన్నను గెలిపించాలని సీపీఐ తీర్మానం

మహబూబాబాద్ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో గురువారం నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈమేరకు నేతలు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా విజయసారధి మాట్లాడుతూ.. సీపీ ఐ శ్రేణులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువకులు, మేధావులు మతోన్మాద బీజేపీ, అవినీతి బీఆర్ఎస్‌ను ఓడించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

సీపీఎం సంపూర్ణ మద్దతు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రకటించారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపునకు సీపీఎం కృషి చేసిందని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థి మల్లన్నకు మద్దతు ఇస్తున్నామని నాయకులు పేర్కొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

- టీఏ, ఎఫ్ఏ, పంచాయతీ కార్యదర్శులకు రూ.8,33,625 జరిమానా

మహబూబాబాద్ రూరల్, మే 23 : మహబూబాబాద్ మండలంలో ఉపాధి హామీ పథకంలో కూలీలు చేసిన పనులపై గత మూడు రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించినట్లు ఈజీఎస్ ఏపీడీ శాంతకుమారి తెలిపారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా అవినీతి అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్, టీఏ, పంచాయతీ కార్యదర్శి ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.8,33,625 జరిమానాలు విధించినట్లు చెప్పారు. నడివాడకు రూ.51194, కంబాలపల్లికి రూ.33913, లక్ష్మీపురం తండాకు రూ.7వేలు, సింగారంకు రూ.8206, వీఎస్.లక్ష్మీపురం రూ.60139, హజార్యతండా రూ.14566, ఉత్తరతండా రూ.9698, రెడ్యాల రూ.4512, గడ్డిగూడెం తండా రూ.1360, ఇస్లావత్‌తండా(ఎస్) రూ.18,240, సాదుతండా రూ.15,100, అమనగల్ రూ.12,714, సికింద్రాబాద్ తండా రూ.19942, మాధవాపురం రూ.39370, వేంనూరు రూ.51341, పర్వతగిరి రూ.28843, సోమ్లతండా రూ.16595, రేగడితండా రూ.15806, దామ్యతండా రూ.6824, లక్ష్మాతండా రూ.4వేలు, సంద్రాలగూడెం రూ.2399, కేవులతండా రూ.11779, ముడుపుగల్ రూ.36440, జంగిలిగొండరూ.34396, అయోధ్య రూ.7వేలు, మల్యాల రూ.37281, సీత్లాతండా రూ.18954, మొట్లతండా రూ.8181, గుండాలగడ్డతండా రూ.15737, జర్పుల తండా రూ.33415, బ్రహ్మణపల్లి లక్ష్మీపురం రూ.10662, ఇస్లావత్‌తండా(ఎం)రూ.29357, తూర్పుతండా రూ.20966, చిన్నకిష్టాపురంరూ.18050,బలరాంతండా రూ.29670, దర్గాతండా రూ.73639, రోటిబండతండా రూ.5206, ఇంద్రనగర్ కాలనీ రూ.9139, బోడగుట్టతండాలో రూ.10324 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు జారిపడి కార్మికుడి మృతి

కేసముద్రం, మే 23: కేసముద్రం మండలం రంగాపురంలో భవన నిర్మాణ కార్మికుడు జారిపడి మృతి చెందడంతో యజమాని ఇంటి ముందు మృతదేహంతో కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన దొంతరబోయిన రమేష్(45) ఇదే గ్రామానికి చెందిన భద్రు ఇంటి నిర్మాణ పనులకు బుధవారం ఉదయం వెళ్లాడు. ఇంటి పైభాగంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమంగా మారడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం రమేష్ మృతి చెందాడు. అతనికి భార్య మల్లికాంబ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద అయిన రమేష్ కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో యజమాని అయిన భద్రు ఇంటిముందు మృతదేహంతో కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ వంశీధర్ ఘటన స్థలానికి చేరుకొని మృతుడి బంధువులను శాంతింపజేసి ధర్నాను విరమింపజేశారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

మహబూబాబాద్ రూరల్, మే 23 : అంతర్ జిల్లా దొంగను చాకచక్యంగా పట్టుకుని 46 గ్రాముల బంగారం, ఐదు గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ గురువారం తెలిపారు. జిల్లాలోని గార్ల మండలానికి చెందిన చింత యుగేందర్ మహబూబాబాద్‌లోని వికలాంగుల కాలనీలో నివాసముంటు సుతారి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పట్టణంలోని ఇల్లందు రోడ్‌లోని పూలే జంక్షన్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన యుగేందర్ అనుమానాస్పదంగా కన్పించడంతో తనిఖీ చేశారన్నారు. బైక్‌కు పత్రాలు లేకపోవడంతో విచారించగా యుగేందర్‌తో పాటు అతని సోదరుడు అశోక్ కలిసి జల్సాలకు అలవాటుపడి మహబూబాబాద్, ఖమ్మం, గార్ల, డోర్నకల్, సీరోలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి ఐదు కేసుల్లో జైలుకు వెళ్లినట్లు చెప్పారు. సుమారు వాటి విలువ రూ.2.74 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ సీఐ చంద్రమౌళి, టౌన్ ఎస్సై ఉపేందర్, సిబ్బందిని రివార్డులతో సీఐ దేవేందర్ అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

దంతాలపల్లి, మే 23 : మండలంలోని బొడ్లాడ గ్రామంలో ఓ యువకుడు తీవ్రమనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన ప్రకారం... బొడ్లాడకు చెందిన కట్ల వంశీ(19) ఈ నెల 21న మనస్తాపంతో కలుపు మందు తాగడంతో బంధువులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వంశీ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు బంధువులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడి నివాళులు

కేసముద్రం, మే 23 : మండలంలోని ఉప్పరపల్లిలో కాంగ్రెస్ నాయకుడు బైరు రాజు తల్లి పూలమ్మ మృతి చెందగా భౌతికకాయానికి ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డిలు గురువారం నివాళులర్పించారు. రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, ఉదయ్‌చందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మహబూబాబాద్ రూరల్, మే 23 : మహబూబాబాద్‌లో ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గురువారం బాధితుడికి అందజేశారు. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన ప్రకారం.. మహబూబాబాద్‌లోని కృష్ణకాలనీలో నివాసముంటున్న కొండి సాయికిరణ్‌కు బుధవారం సాయంత్రం సెల్‌ఫోన్ దొరకగా, రూరల్ ఎస్సై దీపికరెడ్డికి అప్పగించారు. డేటా ఆధారంగా పట్టణ కేంద్రానికి చెందిన అక్కెర సోమేశ్వర్‌గా గుర్తించి గురువారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అందజేశారు.

రేవంత్‌రెడ్డిది రివర్స్‌గేర్ పరిపాలన

- మాజీ మంత్రి హరీష్‌రావు



మరిపెడలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మరిపెడ, మే 23 : సీఎం రేవంత్‌రెడ్డిది అంతా రివర్స్‌గేర్ పరిపాలనే సాగుతున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం మరిపెడ పట్టణంలోని భార్గవ్ ఫంక్షన్ హాల్‌లో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ పట్టభద్రుల నియోజకవర్గ స్థాయి సమావేశానికి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు 24గంటల కరెంట్ ఇస్తే ఇప్పుడు ఎప్పుడు కరెంట్ వస్తదో.. పోతదో తెలియని దుస్థితి ఉందన్నారు. కేసీఆర్ కిట్లు మాయం, తులం బంగారం అని చెప్పి పేదింటి ఆడబిడ్డలకు ఇచ్చే లక్ష సమయానికి ఇవ్వలేదని ఆరోపించారు. ఇలా చెబుతూ పోతే రేవంత్‌రెడ్డి ఎన్నికలప్పుడు చెప్పింది ఏదీ చేయకుండా అంతా రివర్స్ పరిపాలన చేస్తుండని విమర్శించారు. పట్టభద్రులు ఆలోచించి సౌమ్యుడైన రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ తదితరులు మాట్లాడారు.

మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నిక ఓ దళారీకి, ఓ విద్యావేత్తకు మధ్య జరుగుతున్న పోటీ అని, విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచన చేసి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజలు బాధపడుతున్నట్లు గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ మీ ఇంటి మనిషిగా తోడై ఉండి మీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ఉన్నత ఉద్యోగం వదిలి ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చానని ఆశీర్వదించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కె.మహేందర్‌రెడ్డి, మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి, ఎంపీపీ అరుణ రాంబాబు, జడ్పీటీసీ శారదరవీందర్, తాళ్లపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

కేసముద్రం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. కేసముద్రం మండల పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ రాకేష్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాన్సన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, నీలం దుర్గేష్, యాకూబ్‌రెడ్డి, జాటోత్ హరీష్‌నాయక్, చిర్ర యాకాంతంగౌడ్, ఎం.రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో బూత్ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

● పెద్దవంగర : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మోజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశెట్టి మహేష్, ప్రవీణ్, యాకయ్య, రవి, వెంకటేష్, నగేష్, సాయికుమార్, యశ్వంత్, స్మామాట్ పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షలతో ఎంపీటీసీపై దాడి


కొత్తగూడ, మే 23 : వ్యక్తిగత కక్షలతో ఎంపీటీసీపై దాడి చేసిన సంఘటన కొత్తగూడ మండలం కార్లాయి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్లాయికి చెందిన ఎంపీటీసీ పెనుక వెంకన్నపై వ్యక్తిగత కక్షలతో అదే గ్రామానికి చెందిన దారం సందీప్ దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 23: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంజనీరింగ్(బీటెక్) కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవాలని ప్రిన్సిపాల్ బలరాంనాయక్ గురువారంతెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ పరిధిలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి మానుకోటలోని పాత కలెక్టర్ కార్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో సీఎస్ఈ, సీఎస్ఈ(డేటా సైన్స్), ఈసీఈ బ్రాంచ్‌లకు తరగతులు నిర్వహించడ్డాయని పేర్కొన్నారు. ప్రతి బ్రాంచ్‌లో 60 సీట్లు ఉన్నాయని, కాగా, 2024-25 విద్యా సంవత్సరంలో మరో రెండు బ్రాంచ్‌లు ఈఈఈ, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు నిర్వహించబడుతాయని తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ సౌకర్యం ఉన్నట్లు చెప్పారు. కళాశాలలో డిజిటల్ లైబ్రరీ, ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ద్వారా జూన్‌లో వెబ్ ఆప్షన్ నోటిఫికేషన్ వెలువడనుందని ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థులు తమ కళాశాలను ఎంచుకోవాలని సూచించారు.

ప్రజల గొంతుకను గెలిపించాలి

- లక్ష్మి ప్రేమేందర్ రెడ్డి
- తొర్రూరు పట్టణంలో ప్రచారం



తొర్రూరులో పట్టభద్రులను ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న లక్ష్మి ప్రేమేందర్ రెడ్డి

తొర్రూరు, మే 23 : మండలిలో ప్రజా సమస్యలను ప్రశ్నించేందుకు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆయన సతీమణి లక్ష్మి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు పట్టణంలో విస్తృతంగా పర్యటించి పట్టభద్రులను కలిసి ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 ఏళ్లుగా నమ్మిన సిద్ధాంతం కోసం నిస్వార్థంగా పనిచేస్తూ ప్రజల పక్షాన నిలబడి కొట్లాడి ప్రశ్నించే గొంతుక ప్రేమేందర్ రెడ్డి అన్నారు. మండలిలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రధాని మోదీ దేశ అభివృద్ధితో పాటు వరంగల్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి మంజులరెడ్డి, ఉషారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, పల్లె కుమార్, కోటేశ్వర్, ఝాన్సీ సురేష్, రవి, రాజేష్, నవీన్ పాల్గొన్నారు.

● డోర్నకల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆపార్టీ డోర్నకల్ పట్టణ, రూరల్ అధ్యక్షులు దేవాసింగ్, గణేష్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలతో పాటు మునిసిపల్ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కింది స్థాయి నుంచి పార్టీలో ఎదిగారని, ఆయన గెలుపు కోసం పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చింతమల్ల జయరాజ్, లకన్‌వ్యాస్, రమేష్, రెహమాన్ పాల్గొన్నారు.

● గార్ల : కేంద్రంలో సుస్థిర పాలన అందిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వానికే పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని బీజేపీ యువజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్ కుమార్‌జైన్ అన్నారు. గురువారం గార్ల మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. సీతంపేట ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి, జంపాల శ్రీను, దేవా నాయక్, రామునాయక్, సుమలత, బుచ్చిబాబు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ రూరల్: పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని మానుకోట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, నడివాడ గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో కొమ్మాలరెడ్డి, మారగాని రాజుగౌడ్, సతీష్, రంగారెడ్డి, రాజశేఖర్, విజయ్, ప్రభాస్, అనిల్, భార్గవ్, వెంకన్న పాల్గొన్నారు.


పశువైద్యశాలలకు మందుల పంపిణీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, మే 23 : గురక వ్యాధి, జబ్బవాపు వ్యాధి, చిటుకు రోగాల నివారణకు సంబంధించిన మందులు, వ్యాక్సిన్‌లను జిల్లాలోని పశువైద్యశాలలకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జె.సుధాకర్ గురువారం మహబూబాబాద్‌లో పంపిణీ చేశారు. జిల్లాలోని 23 ప్రాథమిక వైద్య కేంద్రాలు, 19 ఉప కేంద్రాలు, మూడు ప్రాంతీయ వైద్య శాలలకు ఈ మందులు, వ్యాక్సిన్‌లను సరఫరా చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ... వేసవిలో కురిసిన అకాల వర్షాలకు పచ్చిగడ్డి బాగా మొలుస్తుందని, ఆ గడ్డిలో అధిక తేమ ఉంటుందని, అలాంటి గడ్డిని గేదెలు, ఆవులు, గొర్రెలు మేయడం వల్ల గురక వ్యాధి, జబ్బవాపు వ్యాధి, చిటుకు వ్యాధి లాంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. వాటి నివారణకు ఈ మందులు, వ్యాక్సిన్లు ఉపయోగపడతాయని తెలిపారు. పశువులకు ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యశాలలకు వెళ్లి నివారణ వ్యాక్సిన్, మందులు తీసుకోవాలని యజమానులకు సూచించారు.

ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలి

తొర్రూరు, మే 23 : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నూతనప్రభుత్వం ఏర్పడితే ఉద్యోగులందరూ కష్టాలు తీరుతాయని సంతోషిస్తే 1వ తారీఖునే వేతనాలు ఖాతాల్లో జమ చేస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత 5 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. వివిధ కేటగిరీల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించడం లేదని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

మహబూబాబాద్ టౌన్, మే 23 : మహబూబాబాద్ పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో టీజేఎస్, టీఎంఎం ఆధ్వర్యంలో గురువారం తొలి సామాజిక విప్లవకారులు గౌతమబుద్ధుడి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ... భారతదేశంలో మొదటి సామాజిక విప్లవాన్ని నడిపిన మహనీయుడు గౌతమ బుద్ధుడని చెప్పారు. బుద్ధుడు తన బోధనలు త్రిరత్న, పంచశీల, అష్టాంగ మార్గం ద్వారా నూతన భావ విప్లవాన్ని సాధించారని చెప్పారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కోట సుధాకర్, చాగంటి ప్రభాకర్, షైన నాగయ్య, ఇరుగు మనోజ్, శ్రీపాల్‌రెడ్డి, మద్దెల వీరస్వామి, భద్రునాయక్, దాసరి మహేందర్, కడారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. కుల రహిత సమాజ నిర్మాణం కోసం గౌతమ బుద్ధుడు పునాదులు వేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, దుడ్డెల రాంమూర్తి, వాసం ఆనంద్, రమేష్, మోహన్, శ్రీనివాస్, యాకయ్య, ప్రవీణ్, శ్రీను, రామకృష్ణ, సాయిబాబా, రాజశేఖర్ పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
★ భవాని ఖార గొర్రెకుంటలో పని చేయడానికి DCM & బొలెరో డ్రైవర్స్ కావలెను. Phone Call Timings : 10am to 6pm. Cont : 8498058893
AJW-5883

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ మహబూబాబాద్, వరంగల్ హంటర్ రోడ్, గోపాల్‌పూర్ నందు గల ShowRooms నందు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. మా ఆఫీస్ నందు ఆఫీస్ అసిస్టెంట్ కావలెను. జీతం : 10,000/- to 15,000/- + ESI, EPF Cont : 8978459111, 6309922608
AJW-0381

కావలెను
★ ప్రముఖ రెడీమేడ్ బట్టల షోరూంలో పనిచేయుటకు సేల్స్‌మెన్ మరియు హెల్పర్లు (Male) కావలెను. సంప్రః 9848287933
AJW-17013

WANTED LADY TEACHERS
★ Wanted Lady Teachers (E/M), Pre-Primary all Subjects, 1st to 5th English, Hindi, Telugu, 6th to 10th Maths & Social. Cont : Indian Kids High School, S.V.N. Road, WGL. 9963006221
AJW-14241

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్రః 8374272215.
AJV 192617

WANTED
★ హన్మకొండ లష్కర్ బజార్ పబ్లిక్ గార్డెన్ దగ్గర ఉన్న HP పెట్రోల్ పంప్ నందు పెట్రోల్, డీజిల్ క్యాషియర్ & ఫిల్లర్స్‌గా ఫిల్లింగ్ పని చేయుటకు యువతి యువకులు కావలెను. (8 గం॥, 12 గం॥, 24 గం॥). సంప్రః 9505919293
AJW-188107

WANTED
★ TR Real Estate & Property Show Room లో పనిచేయుటకు Office Incharge, Supervisors, Computer Operator (Female) & House Keeping Agents కావలెను. KUC Road, Thupakula Plaza. Cont : 9666864866
AJW-188108

WANTED
★ హాస్పిటల్‌లో నైట్ డ్యూటీలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, సిస్టర్స్ మరియు ఆయాలు కావలెను. Time : 8 pm - 9 am, కాకాజి కాలనీ, హన్మకొండ. సెల్ : 9989510003
AJW 188109

ఫ్రిన్స్ రియల్ ఎస్టేట్
★ వరంగల్ గొర్రెకుంటలో కీర్తినగర్ ప్రక్కన ఆర్టీసీ కాలనీలో గల 130 గజాలలో రేకుల ఇల్లు అమ్మబడును. ధర కేవలం 16 లక్షలు మాత్రమే. కీర్తినగర్ కాలనీలో ఇల్లు అమ్మబడును. మా వద్ద ఓపెన్ ప్లాట్స్ అమ్మబడును. సంప్రః 9989388603
AJW 5886

FLAT FOR SALE
★ వరంగల్ - శివనగర్ రాముల వారి గుడి వెనకాల, అరెల్లి అపార్ట్‌మెంట్‌లో 2వ ఫ్లోర్ 2 BHK, 1250 Sft., ఫ్లాట్ నెం. 202 అమ్మకానికి కలదు. సంప్రః 9393223360
AJW-0390

PLOT FOR SALE
★ ముచ్చర్ల రింగ్ రోడ్ గణేష్ నగర్ కాలనీ దగ్గర్లో KUDA లేఅవుట్ ప్లాట్ 60x36 వెస్ట్ సౌత్ ఫేసింగ్ ప్లాట్ అమ్మబడును. సంప్రః 9849002027
AJW 159782

WANTED TEACHERS
★ Preprimary : Female Teachers, Primary : Hindi, Maths, High School : Telugu, Hindi, Physical Science, Social, Female Warden, PET (Unmarried). New Vision High School, Laknepally, NSPT. 9550633624, 9849464761
AJW-159695

WANTED TEACHERS
★ V-Principal-2, 3rd to 10th all Subjects Teachers, Incharges-2, Receptionist-4, Accountants-2, P.E.T.-6, Wardesn (M/F)-10. # ISHS, Ambala Road, near Kits. Cell : 9177039449
AJW 159781

గూగుల్ పే లో టీమ్ లీడర్స్
★ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గూగుల్ పే కంపెనీ కోసం టీమ్ లీడర్స్ కావలెను. అర్హత : డిగ్రీ మరియు సేల్స్‌లో 2 సం॥రాల అనుభవం తప్పనిసరి. జీతం : 7 లక్షల వరకు (అర్హతను బట్టి). సంప్రః 7680099949
AJW-5885

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013, 8978510273
వరంగల్ 9985406150, 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232